జై మార్కండేయ!
జై పద్మశాలి!
పద్మశాలి వర్కింగ్ జర్నలిస్టుల పొదుపు మరియు
పరపతి పరస్పర సహాయక సహకార సంఘం లి.
Regd. No. TMC/WGL(U)/DCO/2020/184
సర్వసభ్య సమావేశం
తేది: 13-07-2024 శనివారం రోజున ఉ॥ 11-00 గం॥ నుండి...
స్థలం: ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ భవన్, హంటర్‌రోడ్, హనుమకొండ.

వరంగల్ వాయిస్
www.warangalvoice.net
Evening Daily
వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 324 శుక్రవారం | 12 జులై 2024 | పేజీలు : 08 | వెల రూ. 5

# భూతల స్వర్గం వరంగల్ పర్యాటకం..



వివరాలు 2లో..

- ఉమ్మడి జిల్లా వైపు ప్రపంచ యాత్రికుల చూపు
- ప్రత్యేక టూర్ ప్యాకేజీలతోనే జీవం
- వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ
- ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలంటున్న జనం






పర్యాటకులకు భూతల స్వర్గంగా వరంగల్ ఉమ్మడి జిల్లా మారే అవకాశం ఉంది. ప్రకృతి సిద్ధమైన వనరులతో పాటు ఆధ్మాత్మిక భావన కల్పించే అద్భుత కట్టడాలకు నెలవు ఉమ్మడి వరంగల్ జిల్లా. ప్రపంచ పర్యాటకులకు రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలికే వనరులకు ఇక్కడ కొదువ లేదు. వరంగల్ పర్యాటకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కొంత శ్రద్ధ పెడితే చాలు ఇక్కడి టూరిజం అద్భుతంగా మారే అవకాశాలు మెండుగా ఉన్నాయి. ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే వరంగల్ ను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దుతానంటూ అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చినా నిధుల కేటాయింపు జరుగక నీరసించింది. అయితే ఇటీవల వరంగల్ నగరంలో పర్యటించిన సీఎం రేవంత్ రెడ్డి వరంగల్ ను పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందని చెప్పడంతో ఇక్కడి పర్యాటకంపై మళ్లీ ఆశలు చిగురించాయి. పర్యాటకుల రాక పెరిగితే ఉపాధి అవకాశాలు మెరుగుపడే అవకాశం ఉంటుంది. అందుకు అనుగుణంగా ఈ ప్రాంతం కూడా అభివృద్ధి చెందుతుందన్న ఆశాభావం ప్రజల్లో నెలకొంది.

- వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి



8లో..

## సుస్థిర పాలనపై.. సీఎం ఫోకస్

- క్షేత్రస్థాయి తనిఖీలపై నజర్
- కలెక్టర్లు తరుచూ గ్రామాలు సందర్శించాలంటూ ఉత్తర్వులు
- 16న బ్యూరోక్రాట్స్‌తో ఇంపార్టెంట్ మీటింగ్



2లో

## సెప్టెంబర్ 9న కాళోజీ కళా క్షేత్రం ప్రారంభం

ఈలోపు పనులు పూర్తి చేయాలి
అధికారులకు కుడా చైర్మన్ ఇనగాల ఆదేశం



8లో..

## మహా వజ్రేశ్వరీగా అమ్మవారు

# భూతల స్వర్గం
# వరంగల్ పర్యాటకం..



**ఉమ్మడి జిల్లా వైపు ప్రపంచ యాత్రికుల చూపు**

**ప్రత్యేక టూర్ ప్యాకేజీలతోనే జీవం**

**వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ**

**ఆ దిశగా ప్రభుత్వం అడుగులు వేయాలంటున్న జనం**

**వరంగల్ వాయిస్, హనుమకొండ ప్రతినిధి :** ప్రస్తుత కాలంలో తమ దైనందిన జీవితంలో ఎదురయ్యే సవాళ్లను, ఒత్తిడిని తగ్గించుకునేందుకు వివిధ ప్రాంతాలను సందర్శించడం పరిపాటిగా మారింది. దీని కోసం కేరళ, ఊటీ, కొడైకెనాల్, డార్జిలింగ్, బెంగుళూరు, తమిళనాడు, ఉత్తర భారతదేశంలోని కొన్ని ప్రాంతాల్లోని పుణ్యక్షేత్రాలనే కాకుండా విదేశాలకు సైతం వెళ్లేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. అయితే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యాటకులను మెప్పించే ప్రదేశాలు చాలా అందుబాటులో ఉన్నాయి. వీటిని చూసేందుకు ప్రపంచ నలుమూలల నుంచి కూడా పర్యాటకులు తరలివచ్చేందుకు ఆసక్తి చూపిస్తున్నారు. కానీ, దానికి తగ్గట్లుగా వసతుల కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మీన మేషాలు లెక్కిస్తుండటంతో ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటకం భారీగా నష్టపోతుంది.

## కట్టిపడేసే ప్రాంతాలు..

వరంగల్ ఉమ్మడి జిల్లా పరిధిలోని ములుగు జిల్లాలో ప్రకృతి సిద్ధంగా వెలిసిన రమ్యమైన ప్రదేశాలు ఏటూరు నాగారం అభయారణ్యం, బొగత జలపాతం, లక్నవరం చెరువు, సమ్మక్క -సారలమ్మల జాతరతో పాటు ఆధ్మాత్మిక భావన కలిగించే యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం, మల్లూరు లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం లాంటి పలు ప్రాంతాలు పర్యాటకులను కట్టిపడేస్తున్నాయి. ఈ ప్రాంతం పర్యాటకులను ప్రకృతితో మమేకమై తమను తాము మరిచిపోయేలా చేస్తోంది. అలాగే వరంగల్ జిల్లా నర్సంపేట సమీపంలోని పాకాల సరస్సు, అక్కడి అరణ్యం మంచి పర్యాటక ప్రాంతంగా గుర్తింపు పొందింది. అలాగే, భూపాలపల్లి జిల్లా గణపురం కోట గుళ్లు, పాండవుల గుట్ట, అలాగే గోదావరి నదీ పరివాహక ప్రాంతమైన కాళేశ్వరం దేవాలయం కూడా పర్యాటకులను ఆకర్షిస్తోంది.

## వరంగల్ నగరంలో..

కాకతీయులు పరిపాలించిన ఓరుగల్లు నగరం పర్యాటక ప్రాంతాలకు నెలవు. ఫిబ్రవరి 2013లో యునెస్కో ద్వారా వరంగల్‌కు ప్రపంచ వారసత్వ నగర హోదా లభించింది. కాకతీయ రాజులు కట్టించిన వేయి స్తంభాల గుడి, భద్రకాళీ అమ్మవారి దేవాలయం, పద్మాక్షిగుట్ట, ఖిలా వరంగల్ కోట, వన విజ్ఞాన్ పార్క్, వరంగల్, పెద్ద దిగంబర జైన విగ్రహం ఉన్న అగ్గలయ్య గుట్ట తదితర ప్రాంతాలు కూడా పర్యాటకుల మదిని దోచుకుంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అదే విధంగా సుప్రసిద్ధ భద్రకాళి దేవాలయం నుంచి పద్మాక్షి గుట్టపైకి రోప్ వే ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఎంతో కాలంగా వినిపిస్తుంది. దీనిని పూర్తి చేస్తే ఈ రెండు దేవాలయాలను సందర్శించేందుకు దేశ నలుమూలలనుంచి భక్తులు, పర్యాటకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చే అవకాశం ఉంది.

## అరకొర వసతులు

పర్యాటకానికి స్వర్గ ధామంగా ఉన్న ఉమ్మడి వరంగల్ జిల్లాలో వసతుల కల్పనపై ప్రభుత్వాలు మీనమేషాలు లెక్కిస్తున్నాయి. ప్రపంచ యాత్రికులను మంత్రముగ్ధులను చేసే ప్రదేశాలకు నెలవైన ఈ ప్రాంతంలో సరైన హోటళ్లు, రవాణా సదుపాయాలు సరిగా లేవు. పర్యాటక ప్రాంతాల్లో ఆహ్లాదంగా గడిపేందుకు కావాల్సిన పరిస్థితులు కూడా సరిగా లేవు. దీంతో యాత్రికుల చూపు ఇతర ప్రాంతాల వైపు మల్లుతోంది. వసతుల లేమితో వరంగల్ పర్యాటకానికి తీవ్ర నష్టం వాటిల్లుతోంది.

## ప్రత్యేక ప్యాకేజీలు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో టూరిజం శాఖ క్రియాశీలకంగా వ్యవహరించాలి. కానీ, టూరిజం శాఖ పేరుకు మాత్రమే అన్నట్లుగా వ్యవహరిస్తోంది. అప్పడప్పుడు ప్రత్యేక టూరిజం ప్యాకేజీల పేరిట హడావిడి మాత్రమే చేస్తోంది. నిత్యం ఏదో ఒక టూర్ ప్యాకేజీ ప్రకటిస్తూ వరంగల్ పర్యాటకాన్ని పరుగులు పెట్టించాల్సిన అవసరం ఉంది. కానీ, దానికి తగ్గట్లుగా పనిచేయడం లేదు. ఆర్టీసీని సమన్వయం చేసుకుంటూ నిత్యం ఏదో ఒక టూర్ ప్యాకేజీలు ప్రకటిస్తూ పర్యాటకులను ఆహ్వానించాలి. అప్పుడే ఇక్కడి పర్యాటకానికి మంచి గుర్తింపు వస్తుంది. ఒక్క అడుగు ముందుకు వేస్తే.. ఆరు అడుగులు వెనక్కి వేసినట్లుగా ఉంది వరంగల్ టూరిజం శాఖ అధికారుల తీరు.

## మేడారం రైలు మార్గంపై ఆశలు..

వరంగల్ జిల్లాలో పర్యాటక అభివృద్ధి రోడ్డు, రైలు మార్గాలతోనే సాధ్యమవుతుందన్నది అక్షర సత్యం. ఇప్పటికే జాతీయ రాహదారి ములుగు జిల్లా గుండా పోవడం కొంతమేర ఉపశమనం కలుగుతుంది. కానీ, మేడారం వరకు రైలు మార్గం పడితే మరింతగా అభివృద్ధికి ఆస్కారం ఉంటుంది. ఇప్పటికే హైదరాబాద్-కాజీపేట-హసన్ పర్తి-భూపాలపల్లి-మేడారం రైలు మార్గం ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం దృష్టిలో ఉంది. ఇది కార్యరూపం దాల్చితే పర్యాటక రంగం బుల్లెట్ మాదిరిగా దూసుకెళుతుంది. దీని కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలి. మేడారం రైలు మార్గంతో వరంగల్ జిల్లా పర్యాటకం కొత్త పుంతలు తొక్కుతుందనేది కాదనలేని నిజం. కాబట్టి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆ దిశగా అడుగులు వేయాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.


## సీఎం ప్రకటనతో జోష్....

ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వరంగల్ నగర పర్యటనలో భాగంగా వరంగల్ అభివృద్ధిపై చేసిన మాటలతో టూరిజంపై జోష్ పెరిగింది. ఇక్కడి పర్యాటకానికి కావాల్సిన వనరులున్నాయని, అందుకు కావాల్సిన నిధులు కల్పించడానికి ప్రభుత్వ కూడా సిద్ధంగా ఉందని, కార్యాచరణతో ముందుకు వెళ్లేందుకు కృషి చేస్తామని సీఎం చెప్పడం వరంగల్ పర్యాటకానికి మరింత ఊపు తెచ్చినట్లయింది. సీఎం ప్రకటన కూడా కార్యరూపం దాల్చి ఇతర రాష్ట్రాల టూరిజం విధివిధానాలను అధ్యయనం చేసి ముందుకు వెళ్లాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు. పర్యాటకంతో ఇక్కడి ప్రాంతం మరింత అభివృద్ధి చెందే అవకాశాలు కూడా ఉంటాయి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ పర్యాటకాన్ని పరుగులు పెట్టించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.









# సెప్టెంబర్ 9న కాళోజీ కళా క్షేత్రం ప్రారంభం

**ఈలోపు పనులు పూర్తి చేయాలి**

**అధికారులకు కుడా చైర్మన్ ఇనగాల ఆదేశం**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** సెప్టెంబర్ 9న కాళోజీ కళా క్షేత్రం ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ చైర్మన్ ఇనగాల వెంకట్రామ్ రెడ్డి ప్రకటించారు. ఈ లోపు పనులను పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం కుడా వైస్ చైర్మన్, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే తోపాటు ఇతర అధికారులతో కలిసి కాళోజీ కళా క్షేత్రాన్ని ఇనగాల క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 లో శంకుస్థాపన చేసి తొమ్మిదేండ్లు గడిచినా పనులు పూర్తి చేయలేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కళా క్షేత్రం నిర్మాణ పనులపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారని, సెప్టెంబర్ 9న కాళోజీ జయంతి సందర్భంగా కళా క్షేత్రాన్ని ప్రారంభించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. జీ ప్లస్ ఫోర్ మాడల్ లో నిర్మిస్తున్న క్షేత్రంలో ఒక్కో అంతస్తులో ఒక్కో ప్రత్యేకత ఉండేలా పార్కింగ్ పనులతోపాటు గ్రౌండ్ ఫ్లోర్ లోని ఆర్ట్ గ్యాలరీ, ఆడిటోరియం, రిహార్సల్ రూమ్స్, గ్రీన్ రూం, మొదటి అంతస్తులో ఆర్టీఎం, ఫ్రీ ఫంక్షన్ వేదిక, ఆఫీస్ రూంలు, ఫుడ్ కౌంటర్, స్టోర్ రూమ్స్, వాష్ రూమ్స్, మూడు మరియు నాలుగు అంతస్తుల్లో ఫ్రీ ఫంక్షన్ హాల్స్, లాబీ, బాల్కనీ, టెర్రస్, క్యాట్ వాక్ లాబీ నిర్మాణ పనులను పరిశీలించి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు.



# మొక్కలు నాటుతాం.. పరిరక్షిస్తాం..

**వైద్య విద్యార్థుల ప్రతిజ్ఞ**



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** సమాజంలోని ప్రతి ఒక్కరూ తమ బాధ్యతగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య పిలుపు నిచ్చారు. కాకతీయ వైద్య కళాశాలలో శుక్రవారం ట్రైబ్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 75వ వన మహోత్సవ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కేఎన్ఆర్ యూ హెచ్ఎస్ రిజిస్ట్రార్ డాక్టర్ సంధ్యా రాణి, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ రాం కుమార్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ సురేందర్, విశ్రాంత డీఎఫ్ఓ పురుషోత్తం, డాక్టర్ ప్రభాకర్ రెడ్డి, శ్రవణ్ లతో పాటు వైద్య విద్యార్థులతో కలిసి కేఎంసీ ఆవరణలో జిల్లా కలెక్టర్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కలు నాటి సంరక్షిస్తామంటూ వైద్య విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ భవిష్యత్ తరాల మనగడకు కాలుష్య రహిత సమాజాన్ని స్థాపించాలన్నారు. ఒక యజ్ఞంలా మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో కేఎంసీ జూనియర్ డాక్టర్ల సంఘం (జూడా) అధ్యక్షులు డాక్టర్ అజయ్ కుమార్, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ మెడికల్ స్టూడెంట్స్ విభాగం రాష్ట్ర కార్యదర్శి అశ్విని నవదీప్, జూనియర్ డాక్టర్లు, వైద్య విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని పెద్ద ఎత్తున మొక్కలు నాటారు.

# రాష్ట్రానికి హోం మంత్రి లేకపోడం దురదృష్టం

## మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గత కొన్ని రోజులుగా రాష్ట్రంలో, జిల్లాలో హత్యలు, మానభంగాలు, పోలీస్ వేధింపులు అధికమయ్యాయని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అన్నారు. శుక్రవారం బాలసముద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పెద్ది సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ సోషల్ మీడియాలో పోస్టులు పెడితే కూడా పోలీసులు థర్డ్ డిగ్రీ చేస్తున్నారని మండిపడ్డారు. చెన్నారావుపేట మండలంలో నిన్నటి 16 చింతల తండా ఉదంతం దారుణమని తెలిపారు. పోలీసులు తీసుకోవాల్సిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. అనేక దారుణ సంఘటనలు జరుగుతున్నా రాష్ట్రానికి హోం మంత్రి లేకపోడం దురదృష్టమన్నారు. జరుగుతున్న ఈ ఘటనలకు సీఎం రేవంత్ రెడ్డినే బాధ్యత వహించాలన్నారు. ఈ నెల 16న ఐఏఎస్, ఐపీఎస్ అధికారులతో సీఎం రివ్యూ మీటింగ్ ఉన్నట్లు తెలిసిందని, ఆ రోజు జరిగే సమీక్షలో రాష్ట్రంలో, జిల్లాలో జరిగిన నేరాలపై సమీక్ష చేయాలని బీఆర్ఎస్ పార్టీ తరుపున డిమాండ్ చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీకి జిల్లాలో సురేఖ, సీతక్క మంత్రులుగా మరో పది మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. కానీ, ఆ 11 నెంబర్ ఎమ్మెల్యే అయిన కడియం శ్రీహరి ప్రవర్తన వేరేగా ఉందని విమర్శించారు. రూ.1600 కోట్ల అభివృద్ధి పనులు ఉమ్మడి వరంగల్ జిల్లాకు బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు తీసుకొచ్చామని, టెండర్ అయిన పనులను ఆపివేస్తున్నారని మండిపడ్డారు. నాడు ఉమ్మడి జిల్లాకు ఎస్ డీఎఫ్ నిధులు రూ.250 కోట్లు వచ్చాయని కానీ, అభివృద్ధి జరగడం లేదన్నారు. మా పార్టీ నాయకుల పైన కేసులు, బీఆర్ఎస్ నాయకులను లాక్కోవడం ఇదేనా ప్రజా పాలన అంటే అని విమర్శించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎస్సై, సీఐ, డీఎస్పీలకు రెండు మూడు సార్లు పోస్టింగ్ లు ఇస్తూ వాళ్లను మారుస్తారా అని ప్రశ్నించారు. తొర్రూరులో జరిగిన ఘటనలు జిల్లాలో ఎక్కడైనా జరిగితే ఉమ్మడి వరంగల్ జిల్లా నాయకులం, కార్యకర్తలు ఇక నుంచి మూకుమ్మడిగా అక్కడకి వెళ్తామన్నారు. డెంగీ జ్వరాలు వస్తున్నాయని, నగరంలో పారిశుధ్యం నిర్వహణ లోపించిందన్నారు. ఇక నుంచి ప్రతీ గ్రామంలో అధికార పార్టీ ఇచ్చిన హామీలపై రోజుకొక సోషల్ మీడియా పోస్ట్ పెడతామని, ఇలాంటి పోస్టులు పెట్టడం కోసం ప్రత్యేక శిక్షణ, కార్యాచరణ మా పార్టీ శ్రేణులకు ఇస్తామన్నారు. పేద కుటుంబాలకు అన్యాయం జరుగుతుంటే అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఏమి పీకుతున్నారని మండిపడ్డారు. తమ పాలనలో రౌడి షీటర్స్ నగరానికి దూరంగా ఉంటే.. నేడు ఆ రౌడీ షీటర్స్ ఖద్దరు చొక్కాలు ధరించారన్నారు. ఇదే వరంగల్ లో వచ్చిన మార్పు అని, కేసీసిఆర్ కుటుంబం అవినీతి మయం అయితే కడియం శ్రీహరి కూడా అవినీతిలో ఉన్నట్టే అని విమర్శించారు. జీవితంలో కాంగ్రెస్ పార్టీ కి ఓటు వేయనని కడియం శ్రీహరి అన్నాడని, మొన్నటి ఎంపీ ఎన్నికల్లో తన బిడ్డకు ఓటు వేయనట్లున్నాడని విమర్శించారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్లు, బీఆర్ఎస్ కార్పొరేటర్లు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## చెరువు కట్టపై చెట్ల తొలగింపు



**వరంగల్ వాయిస్, నడికూడ :** మండలంలోని నార్లపూర్ గ్రామ శివారులోని కోమటికుంట చెరువు కట్టపై వ్యవసాయ భూములకు వెళ్లేందుకు అడ్డంగా ఉన్న చెట్లను కాంగ్రెస్ పార్టీ నాయకులు శుక్రవారం జేసీబీ సహాయంతో తొలగించారు. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశానుసారం అభివృద్ధి పనులలో భాగంగా నార్లాపూర్ గ్రామంలోని రైతులకు తమ వ్యవసాయ భూములకు వెళ్లేందుకు ఇబ్బంది పడకుండా కాంగ్రెస్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఓరుగంటి రాజయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తమ సొంత ఖర్చుతో జేసీబీతో చెట్లను తొలగించారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఈర్ల చిన్ని, మండల సమన్వయ కమిటీ సభ్యుడు పెద్దబోయిన రవీందర్ యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్ శనిగరపు సాంబయ్య, సలహాదారులు శనిగరపు వీరేశలింగం, బండ అశోక్, శివ, భోగి మల్లేష్, శనిగరపు సుదర్శన్, మురళి, శ్రీధర్, మెరుగు చిన్న కొమురయ్య, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## రోగులకు పండ్ల పంపిణీ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** లయన్స్ క్లబ్ 320 ఎఫ్ జిల్లా పూర్వ జిల్లా గవర్నర్ లయన్ డాక్టర్ సుధాకర్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకొని లయన్స్ క్లబ్ ఆఫ్ రఘునాథపల్లి వారు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు పండ్లు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా జడ్పీ కూరెళ్ల ఉపేందర్ గుప్తా, క్లబ్ అధ్యక్షుడు కందుల అనిల్ కుమార్, కార్యదర్శి ప్రదీప్ కుమార్, కోశాధికారి రాజు గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు కందుల అనిల్ కుమార్ మాట్లాడుతూ రోగులకు చేసేటువంటి సేవ పరమావధిగా లయన్స్ క్లబ్ ముందుకు సాగుతుందని, డాక్టర్ సుధాకర్ రెడ్డి జన్మదిన పురస్కరించుకొని ఈ కార్యక్రమం చేపట్టడం మరి ముఖ్యంగా సంతోషదాయకంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ పూర్వ అధ్యక్షుడు శంకర్ రెడ్డి, లక్ష్మీనారాయణ, కరుణాకర్ ఇమ్మడిశెట్టి, వాయినాల సురేష్, రహీం తదితరులు పాల్గొన్నారు.

## గజ్జల దామోదర్ ఇంట్లో తేనేటి విందు

### హాజరైన ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కావ్య



**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కడియం శ్రీహరి, వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు కడియం కావ్య శుక్రవారం చిల్పూర్ మండలం చిన్న పెండ్యాల గ్రామంలో గల మండల పద్మశాలి సంఘం అధ్యక్షుడు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ జాతీయ చేనేత ఇంచార్జి గజ్జల దామోదర్ నేత ఇంట్లో తేనేటి విందును స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎంపీకి శాలువాతో సన్మానం చేశారు. దామోదర్ కుటుంబ సభ్యులను కడియం శ్రీహరి కడియం కావ్య అభినందించారు. ఈ కార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు

## మానవ మనుగడకు వృక్షాలే ఆధారం

### మిల్స్ కాలని సీఐ మల్లయ్య



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మానవ మనుగడకు వృక్షాలే ఆధారమని మిల్స్ కాలని సీఐ మల్లయ్య అన్నారు. ఖిలా వరంగల్ మండలం తూర్పు కోటలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు, ఇందిరా వనప్రభ కార్యక్రమంలో భాగంగా కళాజాత నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్, వాతావరణ కాలుష్య నియంత్రణ వన సంపదతోనే సాధ్యమని వెల్లడించారు. స్వచ్ఛమైన వాయువునిచ్చి ఆక్సిజన్ అందించే చెట్లను కాపాడుకోవాలని అన్నారు. వాతావరణం సమతుల్యత సాధించాలంటే విరివిగా మొక్కలు పెంచాలని పేర్కొన్నారు. నాటిన ప్రతి మొక్కను చంటి పాపలా పెంచి పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీం లీడర్ జూపాక శివ, కళాకారులు మారుముల్ల ఆనందం, రామంచ భారత్, హింగే అరవింద్ కుమార్, కందకట్ల రామకృష్ణ, అంకం రామనాథం, ఎలబోయిన రాజు, ఇల్లందుల సతీష్, ఈటల సమ్మన్న, గుగులోతు శాలిని, మాటేటి అనిత, మైదం ఝాన్సీ, మేకల విజయ, జడల హరిత తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ స్కాలర్ షిప్ విడుదల చేయాలి



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ హనుమకొండ జిల్లా ఆధ్వర్యంలో హనుమకొండ కలెక్టర్ కార్యాలయం ముట్టడించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ ఆరేపల్లి సుజిత్ మాట్లాడుతూ రాష్ట్రంలో పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్, ఫీజు రీయింబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రూ. 7వేలు కోట్ల స్కాలర్ షిప్స్ పెండింగ్ ఉన్నాయన్నారు. రాష్ట్రంలో లిక్కర్ మీద ఉన్న ధ్యాస విద్య మీద లేదని ఎద్దేవా చేశారు. విద్యార్థులను ఇబ్బందుల గురిచేస్తున్నాయి. గత ప్రభుత్వం లాగే ఈ ప్రభుత్వం కూడా విద్యార్థులకు వ్యతిరేకంగా ప్రభుత్వాన్ని నడిపిస్తుంది. ఈ రాష్ట్రంలో ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు అంటూ విద్యార్థులను, నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేసింది. ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న రోజుల్లో తగిన గుణపాఠం చెబుదామని హెచ్చరించారు. ఇకనైనా సోయి తెచ్చుకొని విద్యార్థుల పక్షాన ఉండి ప్రభుత్వాన్ని నడపాలని కాంగ్రెస్ నాయకులను హెచ్చరించారు. అదే విధంగా సీఎం రేవంత్ రెడ్డి జిల్లాకు ఒక ఇంటర్నేషనల్ స్కూల్, విద్యార్థులకు ఆరు నెలల్లో విద్యా భరోసా అంటూ ఎన్నికల సమయంలో ఉచిత హామీలు ఇస్తూ మోసం చేసిన ఈ ప్రభుత్వం, సీఎం, మంత్రులు ఇకనైనా సిగ్గు తెచ్చుకొని వెంటనే స్కాలర్ షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే మంత్రుల, ఎమ్మెల్యేల క్యాంప్ ఆఫీస్ లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అరుణ్, జోనల్ ఇంచార్జి శ్రవణ్ కుమార్, మనోజ్, హరి చరణ్, భరత్, రాహుల్, అన్వేష్, రోహిత్, పవన్ తదితర కార్యకర్తలు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులతో జరభద్రం

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

### డీఎంహెచ్ఓ డాక్టర్ మధుసూదన్



**వరంగల్ వాయిస్, రేగొండ :** సీజన్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అలాగే తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, తమ పరిసరాలలో ఎక్కడ కూడా వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ మధుసూదన్ అన్నారు. సీజన్ వ్యాధులైన, డయేరియా, డెంగీ, మలేరియా, మెదడు వాపు వ్యాధి, అతిసారా వ్యాధుల గురించి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి శుక్రవారం డ్రై డే, ఫ్రైడే గురించి రేగొండ మండలంలోని రాయపల్లి రంగయ్యపల్లి, గ్రామాల్లో మెడికల్ క్యాంపులను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన డాక్టర్ మధుసూదన్ మాట్లాడుతూ, గ్రామంలో ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉండేందుకు కొన్ని జాగ్రత్తలు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ పరిశుభ్రంగా ఉంటూ, తమ పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. అలాగే భోజనానికి ముందు, మలమూత్ర విసర్జన తరువాత చేతులు శుభ్రపరచుకోవాలని తెలిపారు. అదేవిధంగా గ్రామ సమీపంలోని గ్రామాల మధ్య, ఇండ్ల వద్ద ఉన్న రోడ్లలో వర్షపు నీరు నిలువ ఉండకుండా చూడాలన్నారు. అలాగే ప్రతి "ఫ్రైడే డ్రై డే "గురించి వివరించారు. సీజన్ లో వచ్చే డయేరియా, డెంగీ, మలేరియా, బోధకాలు, అది సారా, మెదడువాపు వ్యాధి, వంటి వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, వీటి గురించి అవగాహన కలిగి తగు జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ఐదు సంవత్సరాల లోపు పిల్లలు డయేరియా బారిన పడకుండా అతిసార నుంచి రక్షించుకోవడానికి ఓఆర్ఎస్, జింకు మాత్రలు వాడాలని ప్రజలకు తెలియజేశారు. ఏమాత్రం ఆరోగ్యం బాగా లేదన్న సూచనలు కనబడిన వెంటనే సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో, లేదా సామాజిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ సీ వైద్య అధికారి డాక్టర్ హిమబిందు, ఆశా వర్కర్స్ తదితరులు పాల్గొన్నారు.

# రాధక్క సంతాప సభ విజయవంతం చేయాలి



## కాళోజి సెంటర్‌లో పోస్టర్ ఆవిష్కరణ

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గోదావరి లోయ ప్రతిఘటన పోరాట నాయకురాలు కామ్రేడ్ రాధక్క సంతాప సభను పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో వరంగల్ నగరం ఖిలా వరంగల్ పెట్రోల్ పంపు రోడ్డులోని రోటరీ కమ్యూనిటీ హాల్ లో ఈనెల 14న జరుగుతుందని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు తెలిపారు. ఈ సంతాప సభను జయప్రదం చేయాలని, కోరుతూ శుక్రవారం హనుమకొండలోని కాళోజీ సెంటర్ లో పోస్టర్ ఆవిష్కరించారు. సంతాప సభ ఉదయం 10 గంటల 30 నిమిషాలకు ప్రారంభమవుతుందని, ఈ సభకు న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు గంగుల దయాకర్ అధ్యక్షత వహిస్తారని, పార్టీ ప్రధాన కార్యదర్శి సాదినేని వెంకటేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కే గోవర్ధన్, ప్రగతిశీల మహిళా సంఘం జాతీయ కన్వీనర్ వి.సంధ్య, ఇఫ్ టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్, న్యూడెమోక్రసీ ఖమ్మం, వరంగల్ ఏరియా కమిటీ నాయకులు మోకాళ్ల మురళీకృష్ణ, ప్రగతిశీల యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, తదితరులు ప్రసంగిస్తారని వారు తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో న్యూ డెమోక్రసీ నాయకులు రాచర్ల బాలరాజు, బండి కోటేశ్వరరావు, గంగుల దయాకర్, పీవైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎలకంటి రాజేందర్, జిల్లా నాయకులు గండ్రతి హరిబాబు, రంజిత్, పీడీఎస్ యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి గుర్రం అజయ్, నాయకులు సందీప్, ఇఫ్ టీయూ నాయకులు వీరన్న, రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

## పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి



**వరంగల్ వాయిస్, శంభునిపేట :** నగరంలోని 37వ డివిజన్ లోని గిరిప్రసాద్ నగర్ లో "ఫ్రైడే డ్రైడే " కార్యక్రమంలో భాగంగా మలేరియా విభాగం ఆధ్వర్యంలో ఇంటింటికి తిరిగి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని కార్పొరేటర్ సువర్ణ సురేష్, బాయిలాజిస్ట్ మాధవరెడ్డి, హెల్త్ ఇన్ స్పెక్టర్ మధుకర్, హెల్త్ అసిస్టెంట్ శివ కుమార్ లతో పాటు సిబ్బంది కలిసి పర్యటించారు. నీరు నిలిచినా చోట ఆయిల్ బాల్స్ వేసిన అనంతరం ప్రజలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సువర్ణ సురేష్, బాయిలాజిస్ట్ మాధవరెడ్డిలు మాట్లాడుతూ వర్షాకాలం కావడం వలన ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ మూడు నెలలు పరిసర ప్రాంతాల్లో చాలారోజులు నీరు నిలిచే పాత్రలు, టైర్లు, కొబ్బరి బొండాలు, పూల తొట్టిలు, పాత సామానులు, డ్రంబులు, గోలాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. లేకుంటే వర్షం నీరు నిలిచిన వాటిలో బ్యాక్టీరియా చేరి దోమలు తయారై డెంగీ, మలేరియా, విష జ్వరాలు వచ్చి ఇబ్బందులు పడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మలేరియా విభాగం హెల్త్ ఇన్ స్పెక్టర్ మధుకర్, హెల్త్ అసిస్టెంట్ శివ కుమార్, సిబ్బంది నవీన్, శివ, జనార్దన్, కిరణ్ లతో పాటు మున్సిపల్ శానిటేషన్ జవాన్ హరినాథ్, స్థానిక ప్రజలు గంధం మురళి, రంజిత్, యాదగిరి, రబ్బానీ, సతీష్ లతో పాటు ప్రజలు పాల్గొన్నారు.

## ఘనంగా సుధాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్, ప్రస్తుత జిల్లా సలహాదారుడిగా వ్యవహరిస్తున్న డా. కె.సుధాకర్ రెడ్డి 82వ జన్మదినం సందర్భంగా లయన్స్ క్లబ్ ప్రతినిధులు మర్యాద పూర్వకంగా కలిసి ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ జిల్లా ప్రతినిధులు డా తాళ్ల రవి, ఎం.కోదండ పాణి, అప్పరాజు రాజు,రావుల భాను, ఆర్నే రాజు, పాల్గొన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ వరంగల్ స్పోర్ట్స్ అధ్యక్షుడు రావుల భాను ఆధ్వర్యంలో హనుమకొండ వడ్డెపల్లి శ్మశానవాటికలో మొక్కలను నాటారు. ఈ కార్యక్రమంలో రీజియన్ చైర్మన్ ఈ.కోదండ పాణి, జోన్ చైర్మన్ అప్పరాజు రాజు, స్పోర్ట్స్ క్లబ్ సెక్రటరీ ఆర్నే రాజు, స్థానిక పెద్దలు మాజీ కార్పొరేటర్ ఏనుకటి నాగరాజు, శమల పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## దోమలు పట్ల జాగ్రత్తలు తీసుకోవాలి



**వరంగల్ వాయిస్, వరంగల్ :** మహా నగర పాలక సంస్థ వరంగల్ అర్బన్ మలేరియా విభాగం ఆధ్వర్యంలో బయాలజిస్ట్ మాధవరెడ్డి ఆదేశానుసారం స్పెషల్ ప్రోగ్రాం ఫ్రైడే డ్రై డే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం 32వ డివిజన్ కార్పొరేటర్ పల్లం పద్మ రవి ఆధ్వర్యంలో డివిజన్ ఏరియా బీరన్న కుంట, కోయవాడ, భగత్ నగర్ ఏరియాలలో దోమలు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డివిజన్ ప్రజలకు సూచించారు. డివిజన్ లో నీరు నిలిచిన ప్రాంతాలలో 15 ఆయిల్ బాల్స్ వేయడం జరిగింది. అలాగే పంపు స్ప్రే పిచికారీ చేశారు. నీరు నిలిచి ఉండే పాత కూలర్లు, డ్రమ్ములు, కొబ్బరి చిప్పలు, టైర్లు, మొదలగునవి నీరు లేకుండా ఉంచుకోవాలని తెలియజేశారు. ప్రతి ఒక్కరూ వారి వారి పరిసరాలలో పరిశుభ్రంగా ఉంచుకోవాలని ప్రజలకు సూచించడం జరిగింది. కార్పొరేటర్ తో పాటు మలేరియా సిబ్బంది, డివిజన్ గ్యాంగ్ వర్క్ తిరగడం జరిగింది. ఈ కార్యక్రమంలో అర్బన్ మలేరియా విభాగం హెల్త్ ఇన్ స్పెక్టర్ మధుకర్, హెల్త్ అసిస్టెంట్ శ్యామ్ కుమార్, మలేరియా సిబ్బంది, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.

## బీరన్న బోనాలకు రావాలని నన్నపునేనికి ఆహ్వానం



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** ఈ నెల 17న తొలి ఏకాదశి పర్వదిన సందర్భంగా కరీమాబాద్ లో బీరన్న స్వామి దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో జరిగే బీరన్న బోనాలకు హాజరు కావాలని శుక్రవారం మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ ను కలిసి బోనాల ఆహ్వాన పత్రిక ను అందించారు. మాజీ ఎమ్మెల్యే నన్నపునేని సానుకూలంగా స్పందించి బోనాల పండుగకు హాజరవుతానని హామీ ఇచ్చారు.

## బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం




**వరంగల్ వాయిస్, వరంగల్ :** రంగా రెడ్డి జిల్లా శంషాబాద్‌లోని మల్లికా కన్వేన్షన్ హాల్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సమావేశంలో జీడబ్ల్యూఎంసీ 30వ, 8వ డివిజన్ కార్పొరేటర్లు రావుల కోమల-కిషన్, బైరి లక్ష్మీకుమారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావుల కిషన్, దేవేందర్ రెడ్డి, నరోత్తమ రెడ్డి, మొగిలి తదితరులు పాల్గొన్నారు.

## కేసీఆర్ అడుగుజాడల్లోనే కాంగ్రెస్ పార్టీ

### బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను చేర్చుకోవడం సిగ్గు చేటు

### బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఉద్యమ సమయంలో నీళ్లు, నిధులు, నియామకాలు అని చెప్పి రెండు పర్యాయాలు అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ పాలనలో అవి కేసీఆర్ కుటుంబానికి మాత్రమే దక్కాయని, అతడి కుటుంబం మాత్రమే బంగారం అయిందనీ బీజేపీ వరంగల్ జిల్లా ఉపాధ్యక్షుడు రాదారపు శివకుమార్ మండిపడ్డారు. అదేవిధంగా ఎన్నికల ముందు ఆరు గ్యారంటీలు, పాంచ్ న్యాయ్ అని చెప్పి తెలంగాణ ప్రజలకు అరచేతిలో వైకుంఠం చూపించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కేసీఆర్ అడుగుజాడలలోనే నడుస్తున్నారని విమర్శించారు. ఆరు గ్యారంటీలు, పాంచ్ న్యాయ్ అంటే పక్క పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను మీ పార్టీలోకి తీసుకోవడమేనా అని విమర్శించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యేలు తూ మీ బతుకులు చెడ అధికారం లేనిది మీరు బ్రతకలేరా బీజేపీ ఎమ్మెల్యేలను ఆదర్శప్రాయంగా తీసుకోవాలని సూచించారు. బీజేపీ ఎమ్మెల్యేలు, ఎంపీలు అధికారంలో ఉన్న, అధికారంలో లేకున్నా అదే పార్టీ ఎమ్మెల్యేలుగా కొనసాగారే తప్ప బీఆర్ఎస్, కాంగ్రెస్ ఎమ్మెల్యే మాదిరిగా పార్టీ మారలేదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను వెంటనే అమలు చేయాలని, అమలు చేయని పక్షంలో బీజేపీ కార్యకర్తలతో కలిసి కాంగ్రెస్ ఎమ్మెల్యేల, ఎంపీల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి పక్క పార్టీలో గెలిచిన ఎమ్మెల్యేలను తమ పార్టీలోకి తీసుకునే అంత శ్రద్ధ ఆరు గ్యారెంటీలు అమలు చేయడంపై లేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో లోకల్ బాడీ సర్పంచ్, ఎంపీటీసీ జడ్పీటీసీ ఎన్నికలలో మీ పార్టీకి తెలంగాణ ప్రజలు కర్రు కాల్చి వాత పెట్టడం ఖాయమని కాంగ్రెస్ ప్రభుత్వం పై నిప్పులు చెరిగారు.

## మంత్రి సురేఖను కలిసిన ఆర్టీసీ వరంగల్ ఆర్ఎం విజయ భాను



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** నూతనంగా బాధ్యతలు స్వీకరించిన టీజీఎస్ ఆర్టీసీ వరంగల్ రీజినల్ మేనేజర్ డి.విజయభాను శుక్రవారం దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. నూతనంగా నిర్మిస్తున్న వరంగల్ బస్టాండ్ నిర్మాణం చర్చించారు.

## రంగశాయిపేటలో అన్నదానం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** నగరంలోని 42వ డివిజన్ రంగశాయిపేట గవిచర్ల క్రాస్ జంక్షన్ లో శుక్రవారం అయ్యప్ప ఉత్తర నక్షత్రం సందర్భంగా అయ్యప్ప స్వామి కుటీర భక్తులు అందరూ కలిసి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప భక్త మండలి అన్న ప్రసాద వితరణ అయ్యప్ప స్వామి భక్తులు, ప్రజలు, తదితరులు పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రేపు విద్యుత్ సరఫరాలో అంతరాయం

**వరంగల్ వాయిస్, మరిపెడ :** మరిపెడ సబ్ డివిజన్ పరిధిలోని మరిపెడ, ఎడ్జెర్ల, ఎల్లంపేట 33/11 కేవీ సబ్ స్టేషన్లలో మరమ్మతులు కారణంగా శనివారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని మరిపెడ విద్యుత్ శాఖ ఏడీఈ లోక్ నాథ్ రెడ్డి శుక్రవారం తెలిపారు. ఆయా సబ్ స్టేషన్లలోని ఆయా గ్రామాలలోని విద్యుత్ వినియోగదారులకు ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. విద్యుత్ వినియోగదారులు, రైతులు సహకరించగలరని ఏడీఈ కోరారు.

## మహిళల రక్షణ చట్టాలపై అవగాహన




**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** ఎస్పీ సుధీర్ రామ్ నాధ్ కేకన్ ఆదేశానుసారం అడిషనల్ ఎస్పీ జోగుల చెన్నయ్య ఆధ్వర్యంలో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్, అమనగల్, మహబూబాబాద్ లో శుక్రవారం విద్యార్థిని విద్యార్థులకు మహిళల రక్షణ చట్టాలపై షీ టీం విధులు, మానవ అక్రమ రవాణా, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్, పోక్సో, సైబర్ నేరాలపై షీటీం ఎస్సై సునంద అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ అపరిచిత వ్యక్తుల నుంచి ఫోన్ కాల్స్ వస్తే లిఫ్ట్ చేయవద్దని ముఖ్యంగా విద్యార్థిని, విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని తెలిపారు. విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుపై దృష్టి సారించి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. మహిళల, విద్యార్థినుల భద్రతకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటామన్నారు. గ్రామాలలో ఎవరైనా డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాలకు అలవాటు పడినా, ఎవరైనా విక్రయించిన పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. పిల్లలను చదివించడానికి తల్లిదండ్రులు పడుతున్న కష్టాన్ని విద్యార్థులు గుర్తించి చదువుపై శ్రద్ధ పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ సెకండ్ హెచ్ఎం డానియల్, సీనియర్ అధ్యాపకులు దుర్గయ్య, అధ్యాపక సిబ్బంది, షీ టీం ఏఎస్సై ఆనందం, రమేష్, ఏహెచ్ టీయూ డబ్ల్యూపీసీ సుప్రజ, భరోసా జయశ్రీ తదితరులు పాల్గొన్నారు

## కుడా చైర్మన్‌ను కలిసిన ఏబీఎస్, డీబీఎఫ్ నాయకులు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కుడా చైర్మన్ గా బాధ్యతలు చేపట్టిన ఇనుగాల వెంకటరామిరెడ్డిని ప్రముఖ న్యాయవాది అసైన్డ్ భూమి సమితి (ఏబీఎస్) వ్యవస్థాపక అధ్యక్షుడు మహేందర్, డీబీఎఫ్ ఉపాధ్యక్షుడు చుంచు రాజేందర్ లు శుక్రవారం హనుమకొండలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇనుగాలను శాలువాలతో సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు చెప్పారు. భవిష్యత్తులో మరెన్నో పదవులను అధిరోహించి ప్రజాసేవకు మరింత పునరంకితం కావాలని వారు ఆకాంక్షించారు. ఈ సందర్భంగా వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ కూడా చైర్మన్ పదవి రావడంతో నాపై మరింత బాధ్యత పెరిగిందని గ్రేటర్ వరంగల్ నగర అభివృద్ధికి పాటుపడతానని అన్నారు. ఈ కార్యక్రమంలో డీబీఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదాసి సురేష్, జిల్లా కార్యదర్శి చుంచు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యులను కలిసిన జోరిక రమేష్



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనకు విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, కమిషన్ సభ్యులు రేణుకుంట్ల ప్రవీణ్, జిల్లా శంకర్, నేనావత్ రాంబాబు నాయక్, కొంకటి లక్ష్మీనారాయణలను హనుమకొండలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ లో మర్యాదపూర్వకంగా గ్రేటర్ వరంగల్ మాజీ కార్పొరేటర్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు జోరిక రమేష్ కలిశారు. ఈ సందర్భంగా జోరిక రమేష్ పలు విజ్ఞాపణలు చేయడం జరిగింది. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ కుటుంబానికి న్యాయం చేయాలని, అలాగే నిందితులైన సీఐ జితేందర్ రెడ్డిని, బాధ్యులైన కానిస్టేబుళ్లను వెంటనే రిమాండ్ తో పాటు సర్వీస్ నుంచి తొలగించాలని కోరడం జరిగింది. రాష్ట్రంలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని పకడ్బందీగా అమలు అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మేడ రంజిత్, బైరపాక ప్రశాంత్, కాడపాక రాజేందర్, పొలపల్లి రామ్మూర్తి, మాలకుమ్మరి పరుశురాములు,సరిగొమ్ముల నాగరాజు పాల్గొన్నారు.

## కలెక్టర్లను కలిసిన మార్నెని రవీందర్ రావు

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్, హనుమకొండ జిల్లాల నూతన కలెక్టర్లుగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పి.ప్రావీణ్య ఐఏఎస్, డా.సత్య శారద ఐఏఎస్ లను తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ అపెక్స్ బ్యాంక్





చైర్మన్ మార్నెని రవీందర్ రావు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

## ప్లాస్టిక్ రహిత బ్యాగులను వినియోగించాలి




**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక లాల్ బహదూర్ కళాశాలలో ఎన్సీసీ ఆర్మీ పదవ తెలంగాణ బెటాలియన్ ఆధ్వర్యంలో "పేపర్స్ డే" ప్లాస్టిక్ రహిత దినోత్సవం ప్రిన్సిపల్ డాక్టర్ అరుణ డీహెచ్ రావు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి 10వ తెలంగాణ బెటాలియన్ ఎన్ సీఓ నిఖిలేష్ హాజరై మాట్లాడుతూ పేపర్స్ బ్యాగ్ డే లో అందరు పాల్గొనాలన్నారు. ఇది సమాజ శ్రేయస్సు కోసమే ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని ఉద్దేశంతో ఎన్సీసీ క్యాడే ట్స్ ఒక రోల్ మోడల్ గా ఉంటూ ప్రతి పౌరుడు ప్లాస్టిక్ రహిత బ్యాగులను క్యారీ చేయడం వల్ల వాతావరణ కాలుష్యం, ఆహార నిల్వల్లో రసాయన పదార్థాలు చేరకుండా ఉంటుందన్నారు. నీటిలో వ్యర్థ పదార్థాలు ప్లాస్టిక్ వల్ల జీవరాశులకు పెనుముప్పుగా మారిందని, అది మాన సమాజంపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ రహిత, పేపర్ బ్యాగులను మాత్రమే వాడాలని ప్రతిజ్ఞ చదివించి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించారు. ప్రజల్లో పెద్ద ఎత్తున చైతన్య కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రిన్సిపల్. తెలిపారు. కళాశాల అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ నుంచి విద్యార్థులకు దర్శించిన పేపర్ బ్యాగులను ప్రజలకు నినాదాలు చేస్తూ పేపర్ బ్యాగుల వల్ల ప్రయోజనాలు ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు వారు తయారుచేసిన బ్యాగులను ప్రదర్శించారు. ములుగు రోడ్డు జంక్షన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కెప్టెన్ డాక్టర్ ఎం.సదానందం, ఏ రాజ్ కుమార్ సీనియర్ అండర్ ఆఫీసర్, సంతోషి జూనియర్ అండర్ ఆఫీసర్, వర్ష, కళ్యాణ్ కుమార్ జూనియర్ అండ్ ఆఫీసర్, విద్య శివాని సాహిత్య రజనీకాంత్ నిఖిల్ పాల్గొన్నారు.

## మొగుళ్లపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఎన్‌సీసీ శిక్షణ యూనిట్ ప్రారంభం

**వరంగల్ వాయిస్, మొగుళ్లపల్లి :** మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ఎన్ సీసీ శిక్షణ యూనిట్ ను శుక్రవారం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.విజయపాల్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ సీసీ శిక్షణ ద్వారా శారీరక, మానసిక, ఆధ్యాత్మిక వికాసంతో పాటు దేశభక్తి, ఆర్మీ జీవితం, క్రమశిక్షణ, ఆయుధాల వినియోగం లాంటి అంశాలలో రెండు సంవత్సరాల శిక్షణను ఇస్తారని, అనంతరం పరీక్షలు నిర్వహించి "ఏ" సర్టిఫికెట్ బహుకరిస్తారన్నారు. ఈ సర్టిఫికెట్ వలన ఉద్యోగాలలోనూ, ఉన్నత చదువులు చదవటానికి రిజర్వేషన్ సౌకర్యం ఉంటుందని తెలిపారు. కాబట్టి పాఠశాలలోని 8, 9వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఎన్ సీసీ ఆఫీసర్ గుండెల్లి రాజయ్య ఆధ్వర్యంలో విద్యార్థినీ, విద్యార్థులకు శిక్షణ ఇవ్వనున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ పి.విజయపాల్ రెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. 2024-25 సంవత్సరానికి గాను, 50 మంది విద్యార్థులు పాల్గొనగా 20 మంది బాలురు, 5గురు బాలికలను శిక్షణకు ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో భాషా, సందీప్, భాగ్యశ్రీ, వెంకన్న, సురేందర్, కళ్యాణి, అనిల్ కుమార్, రాజు, కుమారస్వామి, ప్రవీణ్,



పద్మ, లలిత, విజయ భాస్కర్, శ్రీకళ, చందర్, స్పందన, వాచ్ మెన్ సాంబయ్య, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## 14న జనగామ ఏకశిల పబ్లిక్ స్కూల్‌లో ఉచిత మెగా వైద్య శిబిరం

**వరంగల్ వాయిస్, జనగామ :** జిల్లా కేంద్రం జనగామలో ఈనెల 14 ఆదివారం ఉదయం లయన్స్ క్లబ్ ల ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య ఆరోగ్య పరీక్షా శిబిరం నిర్వహిస్తున్నట్లు ఈ ప్రాంత రీజియన్ చైర్మన్లు లయన్ చందుపట్ల రవీందర్ రెడ్డి, లయన్ కలువల భాస్కర్ రెడ్డి తెలిపారు. పట్టణంలోని హైదరాబాదు రోడ్డుకు గల ఏకశిలా పబ్లిక్ స్కూల్ ఆవరణలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు నిర్వహించే ఈ శిబిరంలో సాధారణ పరీక్షలతో పాటు ఎముకలు, కీళ్లు, కిడ్నీ, ఊపిరితిత్తులు, నరాలు, చిన్న పిల్లల వ్యాధులు, స్త్రీల సంబంధిత వ్యాధులు, గుండె జబ్బులు, నేత్ర సంబంధిత వ్యాధులకు సంబంధించి ఆయా వ్యాధుల ప్రత్యేక వైద్య నిపుణులు పరీక్షలు నిర్వహించి, అవసరార్థులకు కొంతమేరకు మందులు ఉచితంగా ఇస్తారు. ఈ కార్యక్రమంలో జనగామ శాసనసభ్యుడు పల్లా రాజేశ్వర్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. లయన్స్ జిల్లా గవర్నర్ కుందూరు వెంకటరెడ్డి శిబిరాన్ని ప్రారంభిస్తారు. గౌరవ అతిథులుగా పూర్వ జిల్లా గవర్నర్లు కన్న పరశురాములు, డాక్టర్ డి.లవకుమార్ రెడ్డి, ఐఎంఏ జనగామ అధ్యక్షుడు డాక్టర్ ఏ.శ్రీనివాసు, ఏకశిల విద్యా సంస్థల కార్యదర్శి చిర్ర ఉపేందర్ రెడ్డి తదితరులు పాల్గొంటారు. పైన పేర్కొన్న వివిధ విభాగాలకు చెందిన వైద్య ప్రముఖులు డా. కల్నల్ మాచర్ల భిక్షపతి, డా.జె బాలాజీ, డా. వి కోటిరెడ్డి, డా. డి లింగమూర్తి, డా. కె.రంజిత్ కుమార్, డా.యు.ప్రవీణ్ కుమార్, డా.జె.స్వప్న రాథోడ్, డా.ప్రీతి దయాల్, డా.డి.స్వప్న, డా.యు లక్ష్మి, డా.జి గౌతమ్ రెడ్డి, డా.సీహెచ్ కనకరాజు, డా.రంగు కార్తీక్, డా. పి.కృష్ణచైతన్య, డా.ఏ శివకుమార్ తదితరులు పాల్గొని పరీక్షలు నిర్వహిస్తారు. మరిన్ని వివరాల కోసం దిగువ సూచించిన శిబిర కోర్డినేటర్స్ ను సంప్రదించ వచ్చునని వారు తెలిపారు. కే .రాజశేఖర్ రెడ్డి 93467 35125, కృష్ణ జీవన్ బజాజ్ 94416 97938, కుర్రేముల యాదగిరి 98482 62702, శ్రీరామ్ శ్రీనివాస్ 98491 54859, పబ్బా చంద్రశేఖర్ 93967 00005. లయన్స్ క్లబ్ ల అధ్యక్షులు వై. సంజీవరెడ్డి, డా. పి. నాగేశ్వరరావు, గాదే నర్సింలు, నల్ల యాదగిరి, డా. డి.శివ శంకరరావు, కె రంజిత్ కుమారులు పర్యవేక్షిస్తున్న ఈ శిబిరంలో అయిదు వందల నుంచి వెయ్యి మంది లబ్ధి దారులు పాల్గొంటారని తెలిపారు.

## ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య



**వరంగల్ వాయిస్, మల్హర్ :** మండల కేంద్రం తాడిచెర్లకు చెందిన మేనం నరేష్ (27)అనే యువకుడు శుక్రవారం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న నరేష్ మనస్తాపంతో ఉరి వేసుకొని చనిపోయాడని కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కొయ్యూరు ఎస్సై నరేష్ తెలిపారు. మృతుడు నరేష్ తాడిచెర్ల ఏఎమ్మార్ కంపెనీలో డ్రైవర్ గా ఉద్యోగం చేస్తున్నాడు.

## రౌడీ రాజకీయాలు మానుకో..



**వరంగల్ వాయిస్, కాటారం :** నిత్యం ప్రజాసమస్యలను తీర్చేందుకు కృషి చేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబు మీద అసత్య ఆరోపణలు చేసి రాజకీయంగా పుట్ట మధు ఎదగాలనుకుంటున్నాడని, ఒక్కసారి అవకాశం ఇచ్చినందుకు పది తరాలకి సరిపడ అక్రమ అస్తులని సంపాదించుకొని, మంథని నియోజకవర్గాన్ని రౌడీ రాజ్యంగా మార్చారని, మంథని ప్రజలు సత్య అసత్యాలని గ్రహించి మళ్ళీ రెండు పర్యాయాలు శ్రీధర్ బాబును గెలిపించినట్లు కాటారం మండల యూత్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చీమల సందీప్ గుర్తు చేశారు. మంథని నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు చేస్తున్న చిల్లర రాజకీయాలను మానుకోవాలని కాటారం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు చీమల సందీప్ హితవు పలికారు. మరోసారి మంత్రి శ్రీధర్ బాబు, శ్రీను బాబులపై బురదజల్లే ప్రయత్నం చేస్తే సహించేది లేదని హెచ్చరించారు.

వరంగల్ వాయిస్ Evening Daily
శుక్రవారం 12, జులై 2024
www.warangalvoice.net

# ఏవీవీ పాఠశాలకు ఐదు లక్షల విరాళం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** స్థానిక వరంగల్ (ఉర్సు) వాస్తవ్యులు, ఏవీవీ కళాశాల పూర్వ విద్యార్థి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల రిటైర్డు అధ్యాపకులు, జాతీయ సేవా పథకం ఉత్తమ ప్రోగ్రాం అధికారిగా రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డు అందుకున్న డా.రణం శ్రవణ్ కుమార్ తండ్రి స్వాతంత్ర్య సమరయోధుడు కీ.శే.రణం మల్లేశం స్మారకార్థం స్థానిక ఏవీవీ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాల నూతన భవన నిర్మాణంలో భాగంగా ఒక తరగతి గది నిర్మాణానికి రూ.5లక్షల రూపాయలను విరాళంగా ఏవీవీ విద్యాసంస్థల కరస్పాండెంట్ డా.చందా విజయకుమార్ కు అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో దాత రణం శ్రవణ్ కుమార్ మాట్లాడుతూ తాను నేడు ఈ స్థాయికి రావడంలో ఈ విద్యాసంస్థ, సంస్థలో పని చేసిన, పని చేస్తున్న అధ్యాపక బృందం ప్రధాన కారణమన్నారు. అందుకే ఈ బృహత్కార్యానికి పూనుకున్నానని, అంతే కాకుండా భవిష్యత్తులో కూడా తన వంతు సహాయ సహకారాలు ఈ విద్యాసంస్థలకు అందచేస్తానని హామీ ఇచ్చారు. ఈ అవకాశం కల్పించిన విద్యాసంస్థల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలిపారు. ఏవీవీ సంఘ కార్యదర్శి, కరస్పాండెంట్ డా.చందా విజయ్ కుమార్ మాట్లాడుతూ ఈ విద్యా సంస్థలో చదువుకొని నేడు ఈ విద్యా సంస్థ విద్యాభివృద్ధికి భారీ విరాళాన్ని అందచేసిన డా.రణం శ్రవణ్ కుమార్ కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.చంద్రమౌళి మాట్లాడుతూ ఈ దాతృత్వాన్ని పాఠశాల భవన నిర్మాణానికి సద్వినియోగం చేసుకోవాలని తెలుపుతూ, దాత శ్రవణ్ కుమార్ కు ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా దాత శ్రవణ్ కుమార్-వనాదేవి దంపతులను యాజమాన్యం, అధ్యాపక బృందం, విద్యార్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో దాత శ్రవణ్ కుమార్ మిత్ర బృందం రిటైర్డు డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏ.విజయ కుమార్, రిటైర్డు డిగ్రీ కళాశాల అధ్యాపకులు డా. అగస్టీన్, రిటైర్డు అధ్యాపకులు మదార్ సాహెబ్ పాల్గొని ప్రసంగించారు. ఏవీవీ సంఘ శాశ్వత సభ్యులు చందా శ్రీకాంత్, ఏవీవీ విద్యా సంస్థల సలహాదారులు వాసుదేవులు, డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్ రావు, జూనియర్ కళాశాల అధ్యాపక బృందం శ్రీనివాస్, సంజీవ, శ్రీధర్, బరుపాటి గోపి, కొడిమ్యాల శ్రీనివాస రావు, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయ బృందం ఏ.సంధ్యారాణి, ఎన్.నవీన్, డా.వై.విజయలక్ష్మీ, జి.భాగ్యలక్ష్మి, జి.సుధారాణి, వి.రమాదేవి, జి.వీరేశలింగం, ఫిలిప్ లాజరస్, శ్రీకాంత్, రజాక్ తదితరులు పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఏవీవీ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఏ.భుజేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా, పాఠశాల ప్రధాన ఉపాధ్యాయులు సమావేశానికి వందన సమర్పణ చేశారు.

## అంధుల సేవ.. దైవ సేవ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** వరంగల్ లూయి ఆదర్శ అంధుల పాఠశాలకు బియ్యం, నిత్యావసర సరుకులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డి. నేషనల్ కన్జుమర్ రైట్స్ కమిషన్ నేషనల్ జాయింట్ సెక్రటరీ, కాకతీయ విశ్వవిద్యాలయం ఈసీ కౌన్సిల్ మెంబర్ డాక్టర్ అనితా రెడ్డి పాల్గొని అంధ పిల్లలకు ఆత్మీయ స్పర్శను అందించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనిత రెడ్డి సరుకులు, స్వీట్లు పంపిణీ చేసి, అనంతరం కేక్ కట్ చేసి పిల్లలకు అందించారు. డాక్టర్ అనితా రెడ్డి మాట్లాడుతూ అంధులు చూపులేక పోయినా మనో నేత్రాలతో చూడగలరని, అత్యంత ప్రతిభ వీరికి ఉంటుందని, దానిని ప్రోత్సహించి మేమున్నామన్న ధైర్యం అందించాలన్నారు. అంధులతో చాలా సేపు సమయం గడిపి వారి సాధక బాధకాలు అడిగి తెలుసుకొని అమ్మలా ఆత్మీయ స్పర్శ అందించారు. అంధుల సేవ విశ్వమానవ సేవ అన్నారు. అంధులు అందివచ్చిన అవకాశాలు వినియోగించుకుని అభివృద్ధిలోకి రావాలని, ఎందరో అంధులు ఐఏఎస్ లుగా, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్నారు. వారిని స్ఫూర్తి గా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వహకులు, డాక్టర్ అనితా రెడ్డి, రమేష్ రెడ్డి, శ్రీలత, అనిత పాల్గొన్నారు.

## దేవాలయ భూములను పరిరక్షించిన మంత్రి సురేఖ



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని 19వ డివిజన్ లోని కాశిబుగ్గలోని సీతారామాంజనేయ, అయ్యప్ప స్వామి దేవాలయం త్వరలో నిర్మించు కళ్యాణ మండప స్థలంపై ఆలయ కమిటీ సభ్యులు 20 సంవత్సరాలుగా కబ్జాదారులతో, కుడాతో పోరాడుతున్నారని తెలంగాణ రాష్ట్ర దేవాదాయ అటవీ పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి వెంటనే స్పందించి కబ్జాదారులపై చట్టరీత్యా చర్య తీసుకోవడం జరిగింది. మంత్రి ప్రత్యేకంగా “కుడా” అధికారులతో స్థలం కోసం మాట్లాడారు. ఆలయ స్థలానికి కుడా అధికారులు సహకరించవలసిందిగా మంత్రి ఉత్తర్వులు జారీ చేయడం జరిగింది. త్వరలోరూ. 4 కోట్ల 30 లక్షల రూపాయలతో నిర్మించబోయే కళ్యాణ మండపం పనుల విషయంపై మంత్రి మాట్లాడుతూ ఎండోమెంట్ అధికారులు, ఆలయ కమిటీ సభ్యులు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. వచ్చే శ్రావణమాసంలో శంకుస్థాపనకు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించినట్లు 19వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దాసరి రాజేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూచన రవీందర్, నీలం శ్రీనివాస్ పాల్గొన్నారు.

# అడ్తి వ్యాపారులను మోసగించిన వ్యక్తి అరెస్ట్




**వరంగల్ వాయిస్, వరంగల్ :** ఏనుమాముల పోలీస్ స్టేషన్ పరిధిలోని బాలాజీ నగర్ కు చెందిన ఇమ్మడి మధుకర్ అనే వర్తక వ్యాపారి, సుమారు 12 ఏళ్లుగా బాలాజీ నగర్ లో శ్రీ కనక మహాలక్ష్మీ ట్రేడర్ పేరుతో అడ్తిదారుల నుంచి మొక్కజొన్నలు,నూకలు కొనుగోలు చేసి, కమిషన్ కింద అమ్ముకునే వాడు. ఈ క్రమంలో అడ్తిదారులను నమ్మించి వారి వద్ద నుంచి వ్యాపారం పేరుతో సుమారు రూ.3 కోట్లు తీసుకొని మోసం చేయడంతో పాటు రైతుల దగ్గర నుంచి ధాన్యాన్ని కొనుగోలు చేసి వారికి ఇవ్వవలసిన డబ్బులు ఇవ్వకుండా పరారయ్యాడు. ఈ నేపథ్యంలో బాధితుడైన జూలూరి కృష్ణమూర్తి అనే వ్యాపారి ఏనుమాముల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఏనుమాముల పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఏనుమాముల ఇన్‌స్పెక్టర్ పులిరమేష్ తెలిపారు. ఈ కేసులో ప్రతిభ కనబర్చిన ఎస్ఐలు శ్రీకాంత్, నరసింహారావు, సిబ్బందిని సీపీ అభినందించారు.

## టాస్క్ ఫోర్స్ పోలీసుల ఆకస్మిక దాడులు

### రూ.9.58 లక్షల పీడీఎస్ బియ్యం పట్టివేత

### రూ.1.58 లక్షల గుట్కా సీజ్



**వరంగల్ వాయిస్, పరకాల :** పరకాల పోలీస్ స్టేషన్ పరిధిలోని వేరు వేరు గ్రామాలలో భారీ స్థాయిలో పీడీఎస్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారన్న సమాచారం మేరకు శుక్రవారం టాస్క్ ఫోర్స్, పరకాల పోలీసులు సంయుక్తంగా కలిసి దాడులు నిర్వహించి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి సుమారు రూ. 9 లక్షల 50 వేల విలువ గల 360 క్వింటాల్ పీడీఎస్ బియ్యంతో పాటు ఒక ఐచర్ డీసీఎం వ్యాన్ ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తున్న తూర్పాటి ఐలయ్య, బండి శంకర్,బండి కుమార్, కొమ్మిడి మధుకర్ రెడ్డిలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదే విధంగా ప్రభుత్వం నిషేదించిన రూ.1.58 లక్షల విలువ చేసే పొగాకు ఉత్పత్తులను రెపాల చంద్ర శేఖర్ గుప్తా వద్ద నుంచి స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడులలో టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ ఎస్.రవికుమార్, ఎస్ఐ నిస్సార్‌పాషా, ఏఎస్సై పీవీ రావు, హెడ్ కానిస్టేబుల్ కృష్ణ, కానిస్టేబుల్ నవీన్, అంజయ్య, నరేష్, శ్రీనివాస్, పరకాల పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు .



## బస్వరాజు సారయ్యకు సన్మానం



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఇటీవల కాంగ్రెస్ లో చేరిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యను 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కార్పొరేటర్ ఆధ్వర్యంలో కాశిబుగ్గ శివాలయం భక్తమార్కండేయ ఆలయం కమిటీ సభ్యులు, అయ్యగార్లు కలిసి శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు గణేశయ్య, మధు అయ్యగారు, మార్త శివప్రసాదయ్య, రాజేశ్వరరావు అయ్యగారు, కొండేటి రజనీకాంత్, ఫోర్గంటి కొమురయ్య, గుండు చంద్రమొగిళి, వైకుంఠం, డా.ఈశ్వరాయప్ప పూర్ణచందర్, మార్తా ఆంజనేయులు, కూరపాటి సత్యనారాయణ, మండల శ్రీరాములు, గుండేటి రజనీకాంత్, తోట బాలరాజు, జంగం రాజు, ప్రభాకర్ పాల్గొన్నారు.

## జంగాకు ఎమ్మెల్యే నాగరాజు శుభాకాంక్షలు



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** హైదరాబాద్ బషీర్ బాగ్ లోని రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ ఆఫీస్ లో ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గా ప్రమాణ స్వీకారం చేసిన జంగా రాఘవ రెడ్డికి శుక్రవారం వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే వెంట సీనియర్ న్యాయవాది గద్దం విష్ణువర్ధన్, రిటైర్డ్ ప్రొఫెసర్ బన్న ఐలయ్య, అచ్యుత్ పాల్గొన్నారు.

వరంగల్ వాయిస్
సినిమా
శుక్రవారం12, జులై 2024
7




# ఆకాశం నీ హద్దురా..హిందీ వర్షన్

## గ్రాండ్‌గా విడుదలైన సర్ఫీరా


బాలీవుడ్ స్టార్ హీరో అక్షయ్‌కుమార్ లీడ్ రోల్‌లో నటించిన తాజా చిత్రం సర్ఫీరా. సుధా కొంగర –సూర్య కాంబోలో వచ్చిన సూరారై పోట్రు (ఆకాశం నీ హద్దురా)కు హిందీ రీమేక్‌గా తెరకెక్కింది. సూర్య కీలక పాత్రలో నటించిన ఈ మూవీ ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైంది. పాజిటివ్ టాక్‌తో స్క్రీనింగ్ అవుతోంది. ఈ సందర్భంగా సూర్య తన సంతోషాన్ని సోషల్ మీడియా ద్వారా షేర్ చేసుకున్నాడు. సర్ఫిరా మనందరికీ ఎప్పటికీ ముఖ్యమైన సినిమాగా ఉంటుంది. అక్షయ్‌కుమార్ సార్ మీ 150వ సినిమాగా సర్ఫిరాను ఎంపిక చేసుకున్నందుకు ధన్యవాదాలు. మీరు సినిమాలో జీవించేలా చేశారు. సుధాకొంగర మీరు చాలా ఏండ్లుగా కలలు కన్న మా సినిమా ఇప్పుడు థియేటర్లలో ఉండటం ఆనందంగా ఉంది. ఇక రాణిగా రాధికామదన్ అద్భుతంగా కనిపించారు. మా సర్ఫిరా నటీనటులు, టీం మెంబర్స్‌కు శుభాకాంక్షలు.. అంటూ ట్వీట్ చేశాడు సూర్య. కెప్టెన్ గోపీనాథ్ సేవలను గుర్తు చేసుకుంటూ.. పరేశ్ రావల్, జీవీ ప్రకాశ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలియజేశాడు సూర్య. మరి సర్ఫిరా కలెక్షన్లు ఎలా ఉండబోతున్నాయనేది చూడాలి. ఇప్పటికే లాంఛ్ చేసిన సర్ఫిరా ట్రైలర్‌కు అద్భుతమైన స్పందన వస్తోంది. ఈ చిత్రాన్ని అబండెన్షియా ఎంటర్‌టైన్‌మెంట్, సూర్య హోం బ్యానర్ 2డీ ఎంటర్‌టైన్‌మెంట్, కేప్ ఆఫ్ గుడ్ ఫిలిమ్స్ సంయుక్తంగా తెరకెక్కించాయి. తనిష్క్ బాగ్చీ, జీవీ ప్రకాశ్ కుమార్ సంగీతం అందించారు.




# సౌత్ ఫిలింఫేర్ అవార్డుల ప్రకటన

## ఆర్‌ఆర్‌ఆర్ , సీతారామం చిత్రాలకు అవార్డుల పంట

2023 సంవత్సరానికి సౌత్ ఫిలింఫేర్ అవార్డులను ప్రకటించారు. వీటిలో ఆర్‌ఆర్‌ఆర్ , సీతారామం చిత్రాలు సత్తా చాటి ఎక్కువ అవార్డులను దక్కించుకున్నాయి. విరాటపర్వం రెండు అవార్డులను కైవసం చేసుకుంది. ముఖ్యంగా సాయి పల్లవి తమిళంలో ఉత్తమ నటిగా, తెలుగులో క్రిటిక్స్ విభాగంలో ఉత్తమ నటిగా రెండు భాషల్లో అవార్డులు దక్కించుకోవడం విశేషం. అంతేగాక సౌత్ ఇండియాలో తక్కువ కాలంలో ఆరుసార్లు ఫిలింఫేర్ అవార్డు దక్కించుకున్న కథానాయికగా రికార్డు సృష్టించింది. ఇంతకు ముందు నాలుగుసార్లు, ఇప్పుడు రెండు అవార్డులతో కలుపుకుని మొత్తంగా 6 అవార్డులు రాగా ఇందులో 4 అవార్డులు తెలుగు చిత్రాలకే రావడం గమనార్హం. రామ్ చరణ్ కు 4వ సారి అవార్డు దక్కింది. ఇప్పటికే 17 ఫిలింఫేర్ అవార్డులతో దేశంలోనే టాప్ ప్లేస్‌లో ఉన్న కమల్ హసన్ ఖాతాలో 18వ సారి అవార్డు వచ్చి చేరింది. అదేవిధంగా తమిళంలో ధనుష్ నటించిన తిరు సినిమా అధికంగా అవార్డులు గెలుచుకోవడం విశేషం. తెలుగులో ఉత్తమ చిత్రం (ఆర్‌ఆర్‌ఆర్).. ఉత్తమ దర్శకుడు రాజమౌళి (ఆర్‌ఆర్‌ఆర్)..ఉత్తమ నటులు రామ్ చరణ్, జూనియర్ ఎన్టీఆర్ (ఆర్‌ఆర్‌ఆర్)..ఉత్తమ నటి మృణాల్ ఠాకూర్ (సీతారామం).. ఉత్తమ సంగీత దర్శుడు కీరవాణి (ఆర్‌ఆర్‌ఆర్).. ఉత్తమ గేయ రచయిత సిరివెన్నెల సీతారామ శాస్త్రి (సీతారామం) ఉత్తమ గాయకుడు కాల భైరవ (ఆర్‌ఆర్‌ఆర్ , కొమరం భీముడో)..ఉత్తమ గాయని (ఫిమేల్) చిన్మయి శ్రీపాద (సీతారామం)..ఉత్తమ చిత్రం (క్రిటిక్స్) సీతారామం..ఉత్తమ నటుడు (క్రిటిక్స్) దుల్కర్ సల్మాన్ (సీతారామం) ఉత్తమ నటి (క్రిటిక్స్) సాయి పల్లవి ( విరాట పర్వం)..ఉత్తమ సహాయ నటుడు రానా (భీమ్లా నాయక్) ఉత్తమ సహాయ నటి నందితా దాస్ (విరాట పర్వం)..ఉత్తమ సినిమాటోగ్రఫీ సెంథిల్, రవి వర్మన్ ఉత్తమ ప్రొడక్షన్ డిజౌన్ సాబు సిరిల్ (ఆర్‌ఆర్‌ఆర్)..ఉత్తమ నఅత్య దర్శుడు ప్రేమ్ రక్షిత్ (ఆర్‌ఆర్‌ఆర్)




## ఆర్‌సి16 కోసం శివరాజ్‌కుమార్ పోస్టర్ విడుదల




గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ నెక్ట్స్ పాన్ ఇండియా చిత్రం ఆర్‌సి 16 కోసం.. 'ఉప్పెన' ఫేమ్, యంగ్ ట్యాలెంటెడ్ దర్శకుడు బుచ్చిబాబు సానాతో చేతులు కలిపిన విషయం తెలిసిందే. తాజాగా ఈ సినిమా నుంచి ఓ ఆసక్తికర అప్డేట్‌ను మేకర్స్ విడుదల చేశారు. శుక్రవారం కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ జన్మదినం సందర్భంగా సినిమాలో ఆయనలుక్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా తెలుగు సినిమాల్లోకి ఆహ్వానిస్తూ సోషల్ మీడియాలో పోస్టర్ రిలీజ్ చేశారు.


# తనకు తానే సాటి..

## అవినీతి పోరాటంతో మరోమారు మెస్మరైజ్

ననటనలో ఏ మాత్రం తనకు సాటిలేదని కమలహాస్ మరోమారు నిరూపించాడు. శంకర్ మార్క్ సినిమాతో చాలా ఏళ్ల తరవాత మరోసారి అవినీతిపై పోరాటంచేశారు. ఇండియన్ సిల్వర్ స్క్రీన్‌పై ప్రయోగాలు చేసే విషయంలో ఎంతటి రిస్క్ అయినా చేసే యాక్టర్లలో కమల్ హాసన్ ముందుంటాడు. అవినీతి, లంచం లాంటి అంశాలను కమల్ హాసన్ టైటిల్ రోల్‌లో భారతీయుడు సినిమాతో సిల్వర్ స్క్రీన్‌పై చూపించి.. అప్పట్లోనే గ్లోబల్ బాక్సాఫీస్‌ను షేక్ చేశాడు దర్శకుడు శంకర్. మళ్లీ 28 ఏండ్ల తర్వాత అదే కథాంశంతో తెరకెక్కించిన సీక్వెల్ ఇండియన్ 2 తెలుగు, తమిళం, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో సందడి చేస్తోంది. తెలుగులో భారతీయుడు 2గా విడుదలైంది. అవినీతి అంశాల చుట్టూ తిరిగే సన్నివేశాలతో శంకర్ స్టైల్‌లో మొదలవుతుంది ఇండియన్ 2. మెల్లగా సిద్దార్థ్ సింపుల్ ఇంట్రడక్షన్‌తో సిల్వర్ స్క్రీన్‌పైకి ఎంట్రీ ఇస్తాడు. దేశవ్యాప్తంగా అవినీతి రోజురోజుకీ ఎలా పెరిగిపోతుందో తెలియజేసేలాసిద్దార్థ్ అండ్ గ్యాంగ్ సోషల్ మీడియాలో వీడియోలు చేస్తూ ప్రజలకు అవగాహన కల్పించే ప్రయత్నం చేస్తుంటారు. అటు నుంచి రకుల్ ప్రీత్ సింగ్ పరిచయం ఉంటుంది. కట్ చేస్తే.. కథ తైవాన్‌కు మారిపోతుంది. ఇక మొదటి సాంగ్ టైం.. క్యాలెండర్ సాంగ్‌తో బాలీవుడ్ యాక్టర్ గుల్షన్ గ్రోవర్ స్టైలిష్ ఎంట్రీ ఇస్తాడు. అసలు ఇండియన్ 2ఎంట్రీ ఎప్పుడెప్పుడు ఉంటుందా..? అని ఎదురుచూస్తున్న ప్రేక్షకుల కోసం ఉలగనాయగన్ వస్తాడు. సేనాపతిగా ఎంట్రీ ఇచ్చిన కమల్ హాసన్ మార్షల్ ఆర్ట్స్‌లో స్కిల్స్‌ను సిల్వర్ స్క్రీన్‌పై ప్రజెంట్ చేసే సన్నివేశాలు ఉంటాయి. ఇక అవినీతి రాజ్యమేలుతున్న భారతదేశంలోకి సేనాపతి ప్రవేశం అనివార్యమైన సందర్భంలో ఇండియాలో ల్యాండింగ్ అవుతాడు సేనాపతి. ఇప్పుడు సేనాపతిగా టైటిల్ రోల్‌ను ఎలివేట్ చేసేలా తాత వస్తడే సాంగ్ ఉంటుంది. శంకర్ మార్క్ విజువల్స్‌తో గ్రాండ్‌గా సాగే ఈ పాట సినిమాకు హైలెట్‌గా చెప్పొచ్చు. అనంతరం సిద్దార్థ్ అండ్ గ్యాంగ్‌పై వచ్చే కొన్ని సన్నివేశాలుంటాయి. ఇక బాబీ సింహా చుట్టూ తిరిగి ఇన్వెస్టిగేటివ్ సన్నివేశాలతో సెకండాఫ్ షురూ అవుతుండగా.. మరోవైపు రకుల్ ప్రీత్ సింగ్ ఫ్యామిలీ సీన్లు వస్తాయి. అప్పటిదాకా ఒక మాదిరిగా సాగిన కథ కొంచెం సీరియస్ మూడ్‌లో వచ్చేస్తుంది. కొన్ని భావోద్వేగ సన్నివేశాల తర్వాత కీలక మలుపు ఎంటో తెలుస్తోంది. కమల్ హాసన్ చేజింగ్ సీక్వెన్స్, ముష్కరమూకలతో ఫైట్ సీక్వెన్స్ వన్ మ్యాన్ షోలా సాగుతుంది. చిన్నపాటి ట్విస్ట్ ఇస్తూ ఊహించని విధంగా సినిమాకు శుభం కార్డు




పడుతుంది. కమల్ హాసన్, సిద్దార్థ్ అండ్ గ్యాంగ్ సన్నివేశాలతో ఒకే అన్నట్టుగా సాగుతుంది. కొన్ని సన్నివేశాలు బాగానే వర్కవుట్ అయినా.. మరికొన్ని సీన్లు మాత్రం ప్రేక్షకులను ఆకట్టుకోవడంలో ఫెయిలయ్యాయనే భావన ప్రేక్షకుల్లో కలుగుతుంది. విజువల్స్ క్లీన్‌గా ఉన్నప్పటికీ.. అనిరుధ్ రవిచందర్ మ్యూజిక్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇంకా గట్టిగా ఇచ్చి ఉంటే బాగుంటుందని మూవీ వలర్స్ అభిప్రాయపడుతున్నారు. కమల్ హాసన్ స్టన్నింగ్ పర్‌ఫార్మెన్స్‌తో వన్ మ్యాన్ ఆర్మీ షోలా సెకండాఫ్ సాగుతుంది. ఎప్పటిలాగే మరో బలమైన సామాజిక సందేశాన్ని అందించే ప్రయత్నం చేశాడు శంకర్. కానీ ఈసారి మాత్రం ఎగ్జిక్యూషన్‌లో కొంత వెనకబడ్డాడనే టాక్ వస్తోంది. చివరి 30 నిమిషాల్లో వచ్చే సన్నివేశాలు మాత్రం కళ్లార్పకుండా చూసేలా గూస్‌బంప్స్ తెప్పించే సన్నివేశాలతో సాగుతుంది. శంకర్‌కు పర్‌ఫెక్ట్ కమ్ బ్యాక్ ఇది అని అంటున్నారు నెటిజన్లు.



## సుస్థిర పాలనపై..
# సీఎం ఫోకస్

**క్షేత్రస్థాయి తనిఖీలపై నజర్**

**కలెక్టర్లు తరుచూ గ్రామాలు సందర్శించాలంటూ ఉత్తర్వులు**

**16న బ్యూరోక్రాట్స్ తో ఇంపార్టెంట్ మీటింగ్**



**వరంగల్ వాయిస్, డోర్నకల్ :** సుస్థిర పాలనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి పార్టీ బలోపేతంతోపాటు పార్లమెంట్ ఎన్నికలపైనే ఎక్కువ ఫోకస్ చేశారు. దశాబ్ద కాలంగా అపరిష్కృతంగా ఉన్న టీచర్ల ప్రమోషన్లు, ఇతర సమస్యను పరిష్కరించేందుకు విద్యాశాఖను తన వద్దే ఉంచుకొని సాహసోపేత నిర్ణయంతో ఓవర్ నైట్ లో పరిష్కార మార్గాన్ని చూపించారు. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టులో సైతం తమ వాదనలు వినిపించి, ఒప్పించి దాదాపు 10వేల మంది టీచర్లకు ప్రమోషన్లు అందించి వారిని సంభ్రమాశ్చర్యానికి గురి చేశారు. ప్రస్తుతం ఇతర ప్రభుత్వ ఉద్యోగుల పదోన్నతలు, బదిలీలు సవ్యంగా జరుతున్నాయి. దీంతో ఇప్పుడు ప్రజాపాలనకు నడుం భిగించారు. జిల్లా కలెక్టర్లు, ఇతర ఉన్నతాధికారులు గ్రామ, పట్టణాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించడం ద్వారా అనేక సమస్యలకు పరిష్కార మార్గం చూపించవచ్చని భావించారు. అందులో భాగంగానే కలెక్టర్లు తరుచూ జిల్లాలోని మారుమూల ప్రాంతాలను సందర్శించాలంటూ ఉత్తర్వులు జారీ చేశారు. పనిలోపనిగా ప్రభుత్వ ప్రజా వైద్యశాలలు, స్కూల్స్, విద్యాలయాలు, గ్రామ పంచాయతీ కార్యాలయాలు, మున్సిపాలిటీలను క్రమం తప్పకుండా తనిఖీలు చేయాలంటూ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. విద్యా ప్రమాణాల పెంపుకై పాఠశాలలో మౌళిక సదుపాయాల కల్పన, నాణ్యమైన విద్యాబోదన, మధ్యాహ్న భోజనంతో పాటు ఉపాధ్యాయుల హాజరు, సర్దుబాటు, వసతి గృహాల తనిఖీలను చేపట్టాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్యం, తాగునీటి సరఫరా, మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలను పర్యవేక్షించాలని సూచించారు. వ్యవసాయం రంగం, విత్తనాలు, ఫెర్టిలైజర్స్, పంటల వివరాలను కూడా పరిశీలించాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిరుపేదల ఆకలి తీర్చేందుకు ప్రభుత్వం పంపిణీ చేస్తున్న బియ్యంపై కూడా ఒక కన్నేసి ఉంచాలంటూ సూచించారు. గ్రామ, పట్టణాల్లో ఇదివరకే నిర్మించిన గృహాలు వాటి స్టేటస్, ఇందిరమ్మ గృహాలు అందించేందకు యాక్షన్ ప్లాన్ రూపొందించాలని సూచించారు. గ్రామాల్లో అంతర్గత రోడ్లు, వాటికి కావాల్సిన మరమ్మతులు, నూతన రోడ్ల, ప్రజా రవాణా, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణ, సామాజిక కార్యక్రమాలు, వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పెన్షన్స్, పట్టణాల్లో టౌన్ ప్లానింగ్, పారిశుధ్యం, నీటి సరఫరా, స్త్రీ శిశు సంక్షేమ, అంగన్వాడి స్కూల్స్ తో పాటు హాస్టల్లలో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. గ్రామ, పట్టణలో తనిఖీలు, అభివృద్ధి కార్యక్రమాలో ప్రజలను భాగస్వాములను చేయాలని సూచించారు. ప్రతి నెల 5వ తేదీ లోపు టూర్ డైరీ చీఫ్ సెక్రటరీ ఆఫీస్ కి పంపాలన్నారు. ఇందులో తాము సందర్శించిన, తనిఖీ చేసిన తీసుకున్న చర్యలను జోడించాలని ఆదేశించారు. ఇంతే కాకుండా సంబంధిత జిల్లా అధికారులు సైతం గ్రామ, పట్టణాలను సందర్శించి వారికి కెటాయించిన శాఖలపై తనిఖీలు నిర్వహించి ప్రజలకు సుస్థిర పాలన అందించాలన్నారు. ఈ మేరకు ఈ నెల 16న కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం రేవంత్ రెడ్డి సమావేశం ఏర్పాటు చేశారు. రాష్ట్ర సెక్రటేరియట్‌లో జరిగే సమావేశంలో దీనిపై ప్రభుత్వ శాఖల ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో చర్చించనున్నారు. రాష్ట్రంలోని కలెక్టర్లు, ప్రిన్సిపాల్ సెక్రెటరీలు,స్పెషల్ సెక్రెటరీలు హాజరుకావాలని ప్రభుత్వ చీఫ్ సెక్రెటరీ శాంతకుమారి ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు.

# మహా వజ్రేశ్వరీగా అమ్మవారు



**వరంగల్ వాయిస్, వరంగల్ :** చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో నిర్వహిస్తున్న శాకంభరి నవరాత్ర మహోత్సవాలు శుక్రవారం ఏడో రోజుకు చేరుకున్నాయి. ఉదయం అమ్మవారికి నిత్యాహ్నికం పూర్తి చేసిన అనంతరం కాళీ క్రమాన్ని అనుసరించి 'విప్రచిత్త' షోడశీక్రమాన్ని అనుసరించి జ్ఞానశక్తిని 'మహావజ్రేశ్వరి'గాను అలంకరించి పూజారాధనలు నిర్వహించారు. మానవ జన్మ సార్థకం కావాలంటూ సాధనా సంపత్తి కావాలని, జీవుడు సాధనలో నిమగ్నం కావాలంటూ అసుర శక్తులు దూరం కావాలని ఆలయ ప్రధానార్చకులు భద్రకాళి శేషు తెలిపారు. అశుర శక్తులు దూరం కావాలంటూ జగన్మాత అనుగ్రహం తప్పనిసరన్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శేషుభారతి ఆధ్వర్యంలో శాకంభరి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

### వేద పాఠశాలలో ప్రవేశాలు..

శ్రీ భద్రకాళీ సాంగవేద ఆగమ సంస్కృత విద్యాలయంలో వైదిక స్మార్త ఆగమము, తైత్తరీయ కృష్ణ యుజుర్వేదాధ్యయనంలో ప్రవేశానికి ఆసక్తి కలిగిన విద్యార్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.శేషుభారతి తెలిపారు. మాతృభాషలో చదవగలిగి, రాయగలిగిన విద్యార్థులు 8 నుంచి 12 సంవత్సరాల మధ్య వయసు కలిగి ఉపనయన సంస్కారం, ఉపాకర్నోత్సర్జనములు పూర్తి ఐనవారు సంధ్యావందనం, అగ్నికార్యం, బ్రహ్మయజ్ఞం కంఠస్థం వచ్చినవారు పాఠశాలలో ప్రవేశానికి అర్హులన్నారు. దరఖాస్తు ఫారాలను భద్రకాళి దేవస్థానం వేద పాఠశాలలో 13నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. పూర్తి చేసిన దరఖాస్తులను ఈనెల 22వ తేదీ లోగా వేదపాఠశాల కార్యాలయంలో అందజేయాలని శేషుభారతి కోరారు.

# నిర్వాసితులకు టౌన్ షిప్

**వరంగల్ కలెక్టర్‌ను కోరిన ఎమ్మెల్యేలు**



**వరంగల్ వాయిస్, పరకాల :** కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్ కు భూములిచ్చిన నిర్వాసితులకు వేగవంతంగా టౌన్ షిప్ ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట శాసనసభ్యులు కేఆర్.నాగరాజు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదను కోరారు. జాతీయ రహదారులు, ఎయిర్ పోర్ట్ ఏర్పాటులో భూములు కోల్పోతున్న వారికి మానవీయ కోణంలో అధిక పరిహారం అందించాలన్నారు. వరంగల్ జిల్లా కలెక్టరేట్ సమావేశం మందిరంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన ఎయిర్ పోర్ట్ భూసేకరణ, కాకతీయ మెగా టెక్స్టైల్ పార్క్, జాతీయ రహదారులకు భూ సేకరణ పురోగతిపై శుక్రవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామ సభలు ఏర్పాటు చేసి అర్బిట్రేషన్ల ద్వారా భూ నిర్వాసితులతో చర్చించి అధిక ధరలు చెల్లించేలా చూడాలన్నారు. భూ నిర్వాసితులకు టౌన్ షిప్ ఏర్పాటు చేయడంతోపాటు మౌలిక సదుపాయాలైన పాఠశాల, కమ్యూనిటీ హాల్, ప్లే గ్రౌండ్, స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఏర్పాటుకు డీటెయిల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సోమవారం సాయంత్రం కల్లా సిద్ధం చేసి సమర్పించాలని ఇరిగేషన్, టీజీఐఐసీ అధికారులను ఎమ్మెల్యేలు ఆదేశించారు.

### మహిళా శక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి..

ఇందిరా మహిళా శక్తి పథకాన్ని వినియోగించుకొని మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా సూచించారు. శుక్రవారం వరంగల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో సెర్ఫ్, స్త్రీనిధి సిబ్బందికి మహిళా శక్తి కార్యక్రమం అమలుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా పాల్గొని సమర్థవంతంగా నిర్వహించుటకు దిశా నిర్దేశం చేశారు. ఈ సమావేశంలో అదనవు కలెక్టర్ జి.సంధ్యారాణి, గఅఆర్ డీఓ కౌసల్య దేవి, జడ్పీ సీఈవో రామిరెడ్డి, లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలీ రాజు, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి బాలకృష్ణ, సంబంధిత శాఖల అధికారులు, అన్ని మండలాల డీపీఎం, ఏపీఎం, సీసీలు, వివోలు తదితరులు పాల్గొన్నారు.



# ఆస్తులు కాదు ప్రకృతిని అందించండి

**సమస్త జీవరాశులకు వృక్షాలే ఆధారం**

**ఎంపీ డాక్టర్ కడియం కావ్య**

**శివునిపల్లిలో ఘనంగా వనమహోత్సవం**







**వరంగల్ వాయిస్, స్టేషన్ ఘన్ పూర్ :** మన భవిష్యత్ తరాలకు అందించాల్సింది ఆస్తులు కాదు ప్రకృతిని అని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. సమస్త జీవరాశులకు వృక్షాలే అదారం అన్నారు. అడవిని రక్షిస్తే అది మనల్ని రక్షిస్తుందన్నారు. శివునిపల్లి గ్రామంలోని పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం వనమహోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా కడియం కావ్య, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి హాజరై మొక్కలు నాటారు. అనంతరం కడియం కావ్య మాట్లాడుతూ భవిష్యత్ తరాలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలంటూ ప్రతీ ఒక్కరు ఐదు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. వనాల సంరక్షణ, పచ్చదనం పెంచేందుకు వనజీవి రామయ్య తన జీవితాన్నే అంకితం చేశారని గుర్తు చేశారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకొని మొక్కల సంరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. గ్రామాల్లో పండ్ల చెట్లు, వేప చెట్లను విరివిగా పెంచాలన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వన మహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. ఈ ఏడాది కోటి మొక్కలు నాటే విధంగా జిల్లా కలెక్టర్, డీఎఫ్ఓ ప్రణాళిక రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వానా భాషా షేక్, అడిషనల్ కలెక్టర్ పింకేష్, డీఎఫ్ఓ లావణ్య, డీపీఓ అనిల్ కుమార్, డీఆర్ డీఓ మొగులప్ప, ఆర్డీఓ వెంకన్న, కళాశాల ప్రిన్సిపల్ పోచయ్య, ఎంపీడీఓ ఉమాదేవి ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ..

చిల్పూర్ మండల కేంద్రంలోని శేషాద్రి నిలయం ఫంక్షన్ హాల్లో ఏర్పాటు చేసిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, స్టేషన్ ఘన్ పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా 74 మంది లబ్ధిదారులకు రూ.74,08,584 విలువగల కళ్యాణ లక్ష్మి చెక్కులను అలాగే 26 మంది ముఖ్యమంత్రి సహాయ నిధి లబ్ధిదారులకు రూ.7.27 లక్షల విలువగల చెక్కులను వారు పంపిణి చేశారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com